ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నంద్యాల

జిల్లా వార్తలు

శుక్రవారం 10 మే 2024



# వైసీపీలో భయం

- ఓడిపోతామనే నైరాశ్యంలో అధికార పార్టీ
- టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టేందుకు కుయుక్తులు
- హింసను ప్రేరేపించి లబ్ధి పొందేందుకు కుట్ర
- సంయమనం పాటిస్తున్న టీడీపీ శ్రేణులు



బీసీ ఇందిరమ్మపై దాడి చేస్తున్న ఎమ్మెల్యే కొడుకు కాటసాని ఓబుళరెడ్డి (ఫైల్)



- గడివేముల మండలంలోని దుర్వేశి గ్రామంలో టీడీపీ ప్రచారాన్ని ముగించుకుని ఇంటికి వెళ్తున్న టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు గత నెల 21వ తేదీన రాత్రి విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు.
- ఈ నెల ఒకటో తేదీన అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కంబగిరిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు.
- రెండు రోజుల క్రితం బనగానపల్లెలోని కూరగాయల మార్కెట్‌లో స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ప్రచారానికి వెళ్లగా, మహిళ అని కూడా చూడకుండా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్‌రెడ్డి తన అనుచరులు దాదాపు 50 మందితో దాడులకు తెగబడ్డారు. ఈ ఘటన సందర్భంగా అక్కడ ఉన్న పోలీసులు వైసీపీ అల్లరి మూకలను నిలువరించే ప్రయత్నం చేసినా ఆగకుండా దాడులకు పాల్పడటం గమనార్హం.



చంద్రశేఖర్ (ఫైల్)



కంబగిరి (ఫైల్)

**నంద్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి):** అధికార పార్టీ నేతల్లో ఓటమి భయం పట్టుకుంది. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఓడిపోతామన్న ఆందోళన ఎక్కువ అవడంతో ఆ కోపం ఎవరి మీద తీర్చుకోవాలో అర్థం కాని పరిస్థితి. టీడీపీ జిల్లాతో రాష్ట్రవ్యాప్తంగా అనుకూల పవనాలు వీస్తుండటం. ఇదే క్రమంలో జగన్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో వైసీపీ నాయకులు దాడుల అస్త్రాన్ని సంధిస్తున్నారు. టీడీపీ కార్యకర్తలపైకి వైసీపీ నాయకులు దాడులకు దిగుతున్నారు. ఇటీవల జిల్లాలో టీడీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులు అందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకోవడంతో కూటమికి అధికారం వస్తుందన్న నెపంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు బహిరంగ దాడులకు పాల్పడుతున్నారు.

వైసీపీ మేనిఫెస్టో నింపిన అసంతృప్తి, ఆ పార్టీ అధినేత జగన్ స్వరంలో మార్పు, బీజేపీ అగ్రనేతలు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా జగన్‌పై విరుచుకుపడటం.. ఇవన్నీ వైసీపీ అభ్యర్థులకు గుబులు పుట్టిస్తున్నాయి. బీజేపీ అగ్రనేతలు జగన్ పాలనపై విమర్శనాస్త్రాలు సంధించిన తర్వాత సీఎం జగన్ మాటల్లో బేలతనం స్పష్టంగా కనిపిస్తోంది. కుట్రలు, కుతంత్రాలతో సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా జరుగుతాయో లేదోనని అపనమ్మకం రోజు రోజుకూ సన్నగిల్లుతోందని జగన్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడగానే వైసీపీలో నైరాశ్యం అలుముకుంది. పార్టీ అధినాయకత్వం నుంచి ఎలాంటి సంకేతాలు వచ్చాయో గానీ ఎన్నికల్లో అలజడులు, అరాచకాలకు వైసీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు శ్రీకారం చుట్టారు. ఇటీవల జిల్లాలో జరుగుతున్న వరుస దాడులు వైసీపీ అరాచకానికి పరాకాష్టగా మారింది. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, బెదిరింపులు, ప్రశ్నిస్తే దాడులు ప్రారంభించారు. కూటమి అభ్యర్థులు, శ్రేణులను కేసుల్లో ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారు. కూటమి అభ్యర్థుల ప్రచారాలు చేసే రోజు అంతం చేస్తాం, ఊరు విడిపిస్తాం, ఎన్నికలు అయిపోగానే ఒక్కొక్కరికి కథ చెబుతామని దూషణలకు దిగటమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారు.

### హింసను ప్రేరేపించేలా..

ఈ ఎన్నికల్లో గెలుస్తామో లేదోనని వైసీపీ అభ్యర్థులు సహనాన్ని కోల్పోతున్నారు. కూటమి అభ్యర్థులు, శ్రేణులు, ఓటర్లపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో తాము పడ్డ బాధలను గుర్తు చేసుకుని ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. సర్వేలన్నీ కూడా ఇవే చెబుతున్నాయి. ఇక జిల్లాలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. దీంతో వైసీపీ నేతలు సహనం కోల్పోయి హద్దు మీరుతున్నారు. రెండ్రోజుల క్రితం బనగానపల్లెలోని ఘటననే తీసుకుంటే.. అప్పటి వరకు ప్రచారం చేసుకున్న వైసీపీ వారికి టీడీపీ కార్యకర్తలు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. కానీ టీడీపీ ప్రచారం మొదలుపెట్టగానే వైసీపీ నేతలు తట్టుకోలేకపోయారు. మిగతా చోట్ల కూడా వైసీపీ కార్యకర్తలు ఇలానే ప్రవర్తిస్తున్నారు. దీనికి తోడు హింసను ప్రేరేపించేలా వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తుండటం వివాదాలకు దారి తీస్తోంది. ఎన్నికలు అనగానే వైసీపీకి ఎక్కడ లేని ఉక్రోశం పుట్టుకొస్తోంది. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చొరవ చూపాల్సిన అధికార పార్టీ అభ్యర్థులు ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, బెదిరింపులకు దిగడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ అభ్యర్థుల తీరు చూస్తే పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుందా? అన్న అనుమానం కులుగుతోందని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సమస్యాత్మక గ్రామాల్లో..

నంద్యాల జిల్లా అనగానే ఫ్యాక్షన్ గొడవలు గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం నియోజకవర్గాల్లో ఈ తరహా గొడవలు అధికం. ఎన్నికల ప్రతీసారి చిన్న నిప్పురవ్వ చెలరేగినా కొద్ది సేపట్లోనే దావణంలా మారుతుంది. జిల్లా వ్యాప్తంగా అలాంటి ప్రాంతాలు 143 ఉండగా, పోలింగ్ బూతులు 373 ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాలపై జిల్లా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఎలాంటి గొడవలు జరగకుండా చూస్తున్నారు. అవసరమైన చోట బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నారు.



ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 8,202 బైండోవర్ కేసులు నమోదు కాగా, 44,192 లీటర్ల అక్రమ మద్యం, సారాను పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.46 కోట్లు ఉంటుంది. అయినా వైసీపీ నేతలు కార్యకర్తలు తమ దాష్టీకాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తల మీద చూపడం మాత్రం ఆపడం లేదు. మొత్తానికి వైసీపీ నేతల్లో మొదలైన ముందస్తు పరాజయం సూచనలతో అక్కసు వారి కార్యకర్తల ద్వారా వెళ్లగక్కుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

## రేపటి నుంచి మద్యం బంద్

**డ్రై డే పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు ఆదేశం**



అధికారులతో సమావేశమైన కలెక్టర్

**నంద్యాల (కల్చరల్), మే 9:** పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 11 వతేదీ నుంచి 13వతేదీ పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలు, వైన్‌షాపులు, బార్లు, రెస్టారెంట్లు మూసివేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శ్రీనివాసులు ఎక్సైజ్, సెబ్, పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి డ్రైడే అంశంపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో 48 గంటల ముందు నుండి మద్యం, ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై పూర్తి నిషేధం అమలవుతుందని అన్నారు. అక్రమ మద్యం తరలించే సమస్యాత్మక రూట్ల వివరాలను సంబంధిత అధికారులకు ఇవ్వాలని అడిషనల్ ఎస్పీ రమణకుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. రానున్న 3రోజులు అత్యంత కీలకమని నగదు, మద్యం, వస్తువుల పంపిణీలపై దృష్టి సారించి నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద అన్ని వాహనాలును క్షుణ్ణంగా తనిఖీ చేయాన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్‌స్క్వాడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

**చాగలమర్రి, మే 9:** జిల్లాలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లవారుజామున చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాలలో చెక్ పోస్టును ఏర్పాటు చేసి అక్రమంగా నగదు, మద్యం, గంజాయి ప్రవేశించకుండా నిరంతరం తనిఖీలు ముమ్మరం చేశామని అన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆయన వెంట సీఐ, ఎస్ఐ, పోలీసులు ఉన్నారు.



## భారీగా తెలంగాణ మద్యం పట్టివేత

- సంగమేశ్వరం వద్ద 3,785 మద్యం బాటిళ్లు
- ఒకరి అరెస్టు, ముగ్గురు పరార్

**కొత్తపల్లి, మే 9:** కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద కొందరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్ఐ హరిప్రసాద్ గురువారం పట్టుకున్నారు. తెలంగాణ నుంచి కృష్ణానదిలో రెండు పుట్టీల మీద 3,365 మద్యం బాటిళ్లను కొత్తపల్లికి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం తరలిస్తున్న రెండు మరబోట్లను సీజ్ చేశారు. తమ రాకను గమనించి ముగ్గురు వ్యక్తులు పరారయ్యారని సీఐ తెలిపారు. అలాగే మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు రెండు మోటారు బైకులపై 370 మద్యం బాటిళ్లను తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తుండగా.. లింగమయ్య స్వామి సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో అహ్మద్ ఉశేన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారయ్యారని అన్నారు. ఓ మోటారు బైక్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

## ఎన్నికలయ్యాక కాటసాని టీడీపీలోకి

**మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి**

**అవుకు, మే 9 :** ఈ ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే కావడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి వచ్చాక కాటసాని రామిరెడ్డి టీడీపీలోకి రావడానికి ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు రామాపురం గ్రామానికి చేరుకున్న బీసీకి టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి, ఉగ్రసేనారెడ్డి, ఎస్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మైనింగ్, నాపరాయి పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నవారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాయల్టీని రూ.8 నుంచి రూ. 5కు తగ్గించానన్నారు. గత ఎన్నికల్లో బందార్లపల్లెలో రాయల్టీ చెక్‌పోస్టును ఎత్తివేస్తామని కాటసాని రామిరెడ్డి ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక రాయల్టీని రూ.6 చేశారని అన్నారు. దీని వల్ల నాపరాయి పరిశ్రమ నడ్డి విరిచారన్నారు. రూ.40వేలు ఉండే డెడ్ రెంట్‌ను రూ.52 వేలకు పెంచిన ఘనత కాటసానికే దక్కుతుందన్నారు. కాటసాని నిర్వాకంతో నాపరాయి పరిశ్రమ నష్టాల ఊబిలో కూరుకు పోయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మారిస్తే జగన్ రాష్ట్రాన్ని గంజాయికి హబ్‌గా మార్చారని ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మొట్ల రామిరెడ్డి పాల్గొన్నారు.



## పోస్టల్ బ్యాలెట్‌లో 16,808 ఓట్లు

**జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు**



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్న నంద్యాల అసెంబ్లీ ఆర్వో రాహుల్‌కుమార్ రెడ్డి, సిబ్బంది

**నంద్యాల (కల్చరల్), మే 9:** జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో మొత్తం 16,808 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొని తమ ఓట్లు వేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 14 మంది ఓటర్లు, శ్రీశైలంలో 138, నందికొట్కూరులో 62, డోన్‌లో 64, నంద్యాలలో 198, బనగానపల్లెలో 48 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని అన్నారు. పత్రికల్లో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలకు పత్రికా యాజమాన్యాలు మీడియా సర్టిఫికేషన్ ఆఫ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు.

## జగన్‌ది అహంకార పాలన : మధు

**కర్నూలు(న్యూసిటీ), మే 9:** రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అహంకార పాలన చేస్తున్నారని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. గురువారం నగరంలోని సుందరయ్య భవన్‌లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే. ప్రభాకర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ అన్ని శాఖలకు కేటాయించిన నిధులను బటన్ నొక్కే కార్యక్రమానికే జగన్ ఉపయోగించారని విమర్శించారు. సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతూ, ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలపై సీఎం నిర్బంధం ప్రయోగించారని అన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు

## రేపు ఆదోనికి జేపీ నడ్డా రాక

**ఆదోని, మే 9:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 11వ తేదీన ఆదోనికి రానున్నారు. ఈ మేరకు ఆదోని పట్టణంలోని మున్సిపల్ మైదానంలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి పార్థసారథి, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు తరఫున ప్రచారం చేస్తారు. ఢిల్లీ నుంచి నేరుగా ఆదోనికి ప్రత్యేక హెలిపాడ్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటలకు చేరుకుంటారని కూటమి అభ్యర్థి పార్థసారథి తెలిపారు.

## డోన్‌లో అంతా ఆ ఇద్దరిదేనట..!



డోన్/నంద్యాల (ఆంధ్రజ్యోతి) మే 9: డోన్‌లో అంతా మన పెత్తనమే జర గాలి.. మొదటిసారి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థి సహాయ కులు సాగిస్తున్న నియంతృత్వ పోకడ ఇది. డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థి కర్నూలు నుంచి ఇద్దరు వ్యక్తిగత సహాయకులను నియ మించుకున్నారు. మీడియా వ్యవహారాలను చూసే బాధ్యతలను ఆ ఇద్దరికి అప్పగించారు. అయితే వారు స్థానికంగా ఉన్న వారిని అణ గదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో చివరకు స్థానికంగా ఉన్న దిగువశ్రేణి నాయకులు కూడా ప్రధాన పార్టీ అభ్యర్థిని నేరుగా కలిసే పరిస్థితి లేకుండా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. ఎన్నికల బిజీలో ఉన్న సదరు అభ్యర్థి తెరవెనుక జరుగుతున్న ఈ వ్యవహారాన్ని గుర్తించలేకపోతున్నారని తెలుస్తోంది. ఆ ఇద్దరు సహాయకుల తీరుపై సోషల్ మీడియాలో కూడా పోస్టింగులు హల్‌చల్ చేస్తున్నాయి. కర్నూలు నుంచి వచ్చిన ఆ ఇద్దరి పని తీరు అభ్యర్థికి ఉపయోగపడేలా ఉండాల్సింది పోయి నష్టం చేకూర్చేలా ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సదరు అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్ బాగున్న తరుణంలో ఇలాంటి వ్యవ హారం కాస్త తలనొప్పిగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. '13 తరువాత వారు వెళ్లిపోతారు.. ఆ తరువాత మేమే కావాలి.. లోకల్‌గా ఉన్న మమ్మల్ని గుర్తించండి అన్న' అని సోషల్ మీడియాలో పెట్టిన ఓ మెసేజ్ వైరల్ కావడంతో డోన్‌లో చర్చనీ యాంశంగా మారింది.

## ఈసారి మా ఓట్లు మీకే.. కానీ...



బురదమయంగా ఉన్న రహదారిని బాగు చేయించాలని కోరుతున్న మహిళలు

**ఆత్మకూరు, మే 9:** ఈసారి మా ఓట్లన్నీ మీకే వేస్తాం.. గెలిస్తే మా వీధిలో సీసీ రోడ్డు వేయండని కరివేన గ్రామంలోని సీతయ్యపేట కాలనీవాసులు బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కరివేన గ్రామంలో పర్యటించారు. ఈ క్రమంలోనే సీతయ్యపేటకు వెళ్లగా అక్కడికి భారీగా మహిళలు గుమిగూడి తమ కాలనీకి సీసీ రోడ్డు లేక వర్షాకాలంలో చాలా అవ స్థలు పడుతున్నామని వాపోయారు. బుడ్డా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒక్క కరివేన గ్రామంలోనే రూ.4 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామని, ఇప్పుడున్న రోడ్లన్నీ తాను వేయించిన వేనని చెప్పారు. అయితే ఐదేళ్లలో ఎమ్మెల్యే శిల్పా కరివేన గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోయినా గత ఎన్నికల్లో 1200 ఓట్లు ఇచ్చా రని గుర్తుచేశారు. ఇప్పటికైనా పనిచేసే నాయకులెవరో గుర్తించాలని కోరారు. దీంతో లక్ష్మీదేవి అనే మహిళ స్పందిస్తూ ఈసారి ఎన్నికల్లో మా ఓట్లన్నీ మీకే వేస్తాం.. గెలిచాక మావీధిలో రోడ్డు వేయించండని కోరగా కచ్చితంగా రోడ్డు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పాడుబడిన బావిని పూడ్చమని కోరగా సొంత ఖర్చులతోనైనా చేయిస్తానని చెప్పారు. కాగా రామాలయంలో సమీపంలోని మరో రహదారి బురదమయంగా మారడంతో అక్కడి మహిళలు రోడ్డు వేయించాలని ఆయన్ని కోరారు.

## ఓటు కోసం నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

**ఆత్మకూరు రూరల్, మే 9:** ఓటు హక్కును కల్పించాలని ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు తహసీల్దార్ కార్యా లయం ఎదుట గురువారం గంట పాటు ధర్నా చేపట్టారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పలువురు ఫారం 12డీలతో తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. కాగా వారికి బ్యాలెట్ పత్రాలు లేవంటూ ఎన్నికల అధికారులు వారించారు. తాము ఎన్నికల విధుల్లో భాగంగా మే 13న పలు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాల్సి ఉందని, ఈ రోజు చివరి రోజని తమకు ఎలాగైనా ఓటు హక్కును కల్పించాల్సిందేనని కోరారు. అనంతరం గంటపాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దీంతో డీటీ మనోహర్ ఈ విషయాన్ని ఆర్వో సుధారాణి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్వో స్పందిస్తూ వారికి ప్రత్యేక అధి కరణల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు తాను అవకాశం కల్పిస్తానని చెప్పారు. వారికి బ్యాలెట్ పత్రాలను సమ కూర్చి స్థానిక డీపాల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే సదుపాయాన్ని కల్పించారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు చివరకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటరు కార్డుకు 30 ఏళ్లు

● 1957లో ప్రతిపాదన.. 1993లో సాకారం



**ఆదోని, మే 9:** ఓటరు గుర్తింపు కార్డు అమలులోకి వచ్చి 30 ఏళ్లవు తోంది. దొంగ ఓట్లను అరికట్టేం దుకుగాను... 1957 సార్వత్రిక ఎన్నికల తరువాత అప్పటి బెంగాల్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. ఈ మేరకు 1961లో కోల్‌కతా నైరుతి లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేసేలా అప్పటి ప్రభుత్వం చట్టంలో కొన్ని మార్పులు చేసింది. కానీ, అప్పటికి ఉన్న వనరుల కారణంగా అది సాధ్యం కాదని భావించి, దానిని అమలు చేయలేదు. టీఎన్ శేషన్ సీఈసీ అయ్యాక ఓటరు గుర్తింపు కార్డులు ఇవ్వకుంటే ఎన్ని కలు జరగవని ప్రకటించారు. దీంతో కేంద్రం 1993 ఆగస్టులో తొలి సారి గుర్తింపు కార్డులు జారీ చేసింది. అప్పట్లో అవి నలుపు, తెలుపు రంగుల్లో మాత్రమే ఉండేవి. 2015 నుంచి డిజిటల్ విధా నంలో రంగుల్లో ముద్రిస్తున్నారు.

# టెండరు.. ఎవరూ ఉండరు!



బేతంచెర్ల సమీపంలో జరుగుతున్న హైవే రోడ్డు నిర్మాణ పనులు

**డోన్, మే 9:**

డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన చెప్పినవారికి టెండరు దక్కాల్సిందే. అది కూడా పోటీ లేకుండా టెండరు పనుల ప్రక్రియ నడవాల్సిందే. కాదని టెండరులో పాల్గొంటే బిల్లులు రావని బెదిరిస్తారు. చివరకు మంత్రి అనుకూల కాంట్రాక్టర్లకు పనులు కట్టబెడతారు. నియోజకవర్గంలో జరిగిన కాంట్రాక్టు పనుల్లో పెద్ద ఎత్తున ఇట్లా దోచుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆర్థిక మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వివిధ బ్రాండ్ల కింద డోన్ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గంలో బీటీ రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు తీసుకువచ్చారు. మంజూరైన నిధులతో చేపట్టిన బీటీ రోడ్లకు నిర్వహించిన టెండర్లలో మంత్రి బుగ్గన చక్రం తిప్పారు. దీంతో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మంత్రి సేవలో పని చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో అధికారులకు పర్సంటేజీల రూపంలో పెద్ద మొత్తంలోనే ముట్టజెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- మంత్రి చెప్పినోళ్లకే పనులు
- ఇతరులు పోటీ పడకుండా బెదిరింపులు
- తన వారికే దక్కేలా అధికారులకు ఆదేశాలు
- నెల్లూరు, కర్నూలు, హైదరాబాదు కాంట్రాక్టర్లదే హవా
- బుగ్గన బంధువుకే హైవే రోడ్డు టెండర్
- డోన్ ఇలాఖాలో ఇదో రకం దందా

### ● మంత్రిని కాదంటే నో టెండర్:

డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గనను కాదని కాంట్రాక్టు పనులకు టెండర్లు ఎవరూ వేయలేని పరిస్థితిని కల్పించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ప్యాపిలి నుంచి శభాష్‌పురం వరకు రూ.6 కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి టెండరు పిలిచారు. డోన్ మండలానికి చెందిన వైసీపీ నేత తనకు సంబంధించిన కాంట్రాక్టరుతో టెండరు వేయించారు. అయితే బుగ్గన నేరుగా రంగంలో దిగారు. ఇదివరకే వేరే కాంట్రాక్టరుకు మాట ఇచ్చాను.. వేసిన టెండరును వెనక్కు తీసుకోవాలని మంత్రి సొంత పార్టీ నేతపైనే ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేదేమీ లేక మంత్రి ఆదేశాలను పాటించాల్సి వచ్చింది. ఇలా నియోజకవ ర్గంలో మంత్రి బుగ్గనను కాదని టెండరు వేసే సాహసం చేయలేకపోయారు. ఒక వేళ ఎవరైనా టెండరు వేస్తున్నారని తెలిసినా మంత్రి కార్యాలయం నుంచి సదరు కాంట్రాక్టరుకు బెదిరింపులు వెళ్లడం సర్వసాధారణం. మంత్రి బుగ్గనను కాదని టెండరు వేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితిని తీసుకొచ్చారు.

### ● వాటర్ గ్రిడ్ పనుల్లో పర్సంటేజీల దందా...

డోన్ నియోజకవర్గంలో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనుల్లో భారీ ఎత్తున పర్సంటేజీల దందా నడిచినట్లు విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో ప్రతి ఇంటికి కొళాయి, శుద్ధజలం అందించేందుకు రూ.330 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజె క్టును చేపట్టారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తండా ప్రాంతం వద్ద నిర్మించిన ఫిల్టర్ వాటర్ పంప్ హౌస్‌కు నీటిని తరలించి శుద్ధి చేయాల్సి ఉంటుంది. మంత్రి బుగ్గన హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీకి ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు పనులను అప్పగించారు. సదరు కంపెనీ పైపులైన్ల నిర్మాణ పనులను వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధికి సబ్ కాంట్రాక్టుగా అప్పగించినట్లు తెలిసింది. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనుల్లో డోన్ నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చు కోసం పర్సంటేజీల రూపంలో పెద్ద మొత్తాన్ని రాష్ట్ర స్థాయి నేతకు సమర్పించుకున్నట్లు ఆరోప ణలు ఉన్నాయి.



డోన్-రాయల్ చెరువు బీటీ రోడ్డు

### మంత్రి బుగ్గన గుప్పిట్లో టెండర్లు

ఆర్థిక మంత్రి బుగ్గన ప్రాతినిధ్యం వహి స్తున్న డోన్ నియోజకవర్గంలో కాంట్రాక్టు పనుల టెండర్లన్నీ ఆయన గుప్పిట్లో పెట్టుకొని నడిపిం చారు. మంత్రి బుగ్గనకు సన్నిహితంగా ఉన్న నెల్లూరు, కర్నూలు, హైదరాబాదు ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లను ఏర్పాటు చేసుకున్నాడు. నియోజకవ ర్గంలో జరిగే కాంట్రాక్టు పనులన్నీ తన సన్నిహిత కాంట్రాక్టర్లకు అప్ప గించాడు. డోన్ నుంచి రాయలచె రువు వరకు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.52 కోట్లతో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కాంట్రాక్టు పనుల టెండర్లలో ఎవరూ పాల్గొనరాదని మంత్రి హుకుం జారీ చేశారు. తనకు సన్నిహితంగా ఉండే నెల్లూ రుకు చెందిన కాంట్రాక్టరుకు టెండరు పని వచ్చేలా పావులు కదిపారు. టెండర్లలో ఎవరూ పోటీలో పాల్గొనకుండా కాంట్రాక్టరుకు సంబంధించిన వారి తోనే డమ్మీ టెండర్ వేయించడం ఇక్కడ అలవాటుగా మారిపోయింది. తర్వాత మంత్రి చెప్పిన కాంట్రాక్టరుకే టెండరు దక్కేలా అధికారులు పని చేశారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో రూ.10కోట్లకు పైగానే వివిధ పనులు చేపట్టారు. ఈ పనులను నెల్లూరుకు చెందిన కాంట్రాక్టరు దక్కించుకున్నాడు. పట్టణంలోని ప్రధాన రహదారి డబుల్ బీటీ రోడ్డు పనులను రూ.11 కోట్లతో చేపట్టగా.. నెల్లూరు చెందిన కాంట్రాక్ట రుకే వాటిని అప్పగించారు. పట్టణంలో రూ.18 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్ టెండర్ పనులను హైదరాబాదుకు చెందిన కాంట్రాక్టరుకు అప్పగించారు. పట్టణంలోని గుత్తి రోడ్డులో రూ.35 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టారు. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టరుకే ఈ పనులు దక్కేలా చేశారు. ఇలా డోన్, ప్యాపిలి మండలాల్లో జరిగిన బీటీ రోడ్ల పనుల్లో నెల్లూరు, హైదరాబాదుకు చెందిన కాంట్రాక్టర్ల హవా నడిచింది. కర్నూలుకు చెందిన కాంట్రాక్టరుకు అనధికారికంగా సబ్ కాంట్రాక్టు పనులు ఇచ్చినట్లు వైసీపీ నేతల్లోనే టాక్ వినిపి స్తోంది. ఈ కాంట్రాక్టు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు పర్సంటేజీల రూపంలో రాష్ట్ర స్థాయి నేతకు పెద్ద మొత్తంలో సమర్పించు కున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



సోమయాజులపల్లె వద్ద మంత్రి బంధువు కంకర క్రషర్ యూనిట్

### మంత్రి బంధువే.. హైవే రోడ్డు కాంట్రాక్టరు

పాణ్యం నియోజకవర్గంలోని సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకు 300బీ జాతీయ రహదారిని రూ.650 కోట్లతో నిర్మిస్తు న్నారు. ఇంత పెద్ద కాంట్రాక్టు పనులను దక్కించుకునేందుకు మంత్రి బుగ్గనే స్వయంగా రంగంలో దిగారన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబా దుకు చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరులో పాల్గొనేలా చక్రం తిప్పారు. జాతీయ రహదారి 52 కి.మీ. మేర నిర్మాణం జరగాలి. ఎన్నికలకు ఆరు నెలల ముందు ఆగమేఘాల మీద రైతుల నుంచి భూసేకరణ చేపట్టి నిర్మాణ పనులు ప్రారంభించారు. హైవే రోడ్డు నిర్మాణానికి పెద్దఎత్తున కంకర అవసరం ఉంటుంది. దీంతో మంత్రి బుగ్గన స్వయంగా బంధువుకు సోమయాజులపల్లె వద్ద కంకర క్రషర్ ఏర్పాటు కోసం ఆగమేఘాల మీద అనుమతులు ఇప్పించారు. మంత్రి బంధువుకు సంబంధించిన క్రషర్ నుంచే హైవే రోడ్డు నిర్మాణానికి కంకరను సరఫరా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అదేవిదంగా అనంతపురం జిల్లాలోని గుత్తి దగ్గర కూడా మంత్రి బంధువుకు కంకర క్రషర్ ఉంది. అక్కడ నుంచి కూడా డోన్ నియోజకవ ర్గలో జరిగే రోడ్ల నిర్మాణ పనులన్నింటికీ కంకరను రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. హైవే రోడ్డు కాంట్రాక్టు పనుల టెండర్లను దక్కించుకున్న కంపెనీ మంత్రి బంధువుదే కావడంతో పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటు న్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి.

# నందికొట్కూరులో త్రిముఖ పోరు

● టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ ● గుబులు పుట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ





**నందికొట్కూరు, మే 9:** నందికొట్కూరు నియో జకవర్గంలో ప్రధానంగా టీడీపీ అభ్యర్థి గిత్తా జయ సూర్య, వైసీపీ అభ్యర్థి ధారా సుధీర్‌ల మధ్య బల మైన పోటీ నెలకొంది. టీడీపీలో గిత్తా జయసూర్య గెలుపు కోసం మాండ్ర శివానందరెడ్డి పోరాటం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ధారా సుధీర్ విజయం కోసం బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కృషి చేస్తు న్నారు. నందికొట్కూరు నియోజకవర్గం ఏర్పడిన 1952 నుంచి కాంగ్రెస్ పార్టీదే హవా సాగింది. 1955, 1967, 1972, 1978, 1989, 2004, 2009లలో కాంగ్రెస్ ఎనిమిదిసార్లు విజయం సాధించగా, 1985, 1994, 1999లలో టీడీపీ మూడు సార్లు గెలుపొందింది. 2014, 2019లలో వైసీపీ విజయం సాధించింది. ప్రస్తుతం హ్యాట్రిక్ సాధించాలని వైసీపీ పావులు కదుపుతోంది. అయితే 20 ఏళ్లుగా టీడీపీ అధికారానికి దూరంగా ఉంది. ఈ సారి విజయం కోసం ఆ పార్టీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇందులో భాగంగా టీడీపీ, వైసీపీ నేతలు ఎత్తులకు పై ఎత్తులు వేసు కుంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.

**● టీడీపీ ప్రచార జోరు:**

టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. రోజుకు రెండు మండ లాల్లో ప్రచారం చేస్తున్నారు. మరో వైపు మాండ్ర శివానందరెడ్డి మరో రెండు మండలాలను కవర్ చేస్తూ ప్రచారం సాగిస్తున్నారు. అలాగే మాండ్ర లింగారెడ్డి ఇంటింటి ప్రచారం పూర్తి చేసిన అనం తరం పగిడ్యాల, నందికొట్కూరు మండలాల్లోని ఉపాధి కూలీల వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార అనుమతులు, పార్టీ అంతర్గత వ్యవహారా లను మాండ్ర ఉమాదేవి పర్యవేక్షిస్తూ ఇలా ఎవరికి వారు గిత్తా జయసూర్య గెలుపు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు.

**జయసూర్య బలాలు..**

● గిత్తా జయసూర్య బలం: చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలకు ప్రజలు ఆకర్షితులు అవుతున్నారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి గిత్తా జయ సూర్యకు బలం.

**బలహీనతలు..**

టీడీపీలో ఉన్న పాత వర్గాన్ని కలుపుకుపోవడం లేదన్న విమర్శలు

**సుధీర్ బలాలు..**

వరుసగా రెండు విజయాలు ధారాకు బలం చేకూర్చుతు న్నాయి. ధనబలం, పైగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మద్దతు ఆయ నకు బలంగా నిలుస్తున్నాయి.

**బలహీనతలు..**

వరుస రెండు విజయాలతో ఉన్న వైసీపీకి ఈ సారి ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో పాటు, స్థానికేతరుడు అనే ప్రచారం జరుగుతోంది. 2014, 2019లలో గెలిచినా కూడా ఈ పదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం.

**● గిత్తా గెలుపు కోసం మాండ్ర కుటుంబం పోరాటం:**

గిత్తా జయసూర్య గెలుపునకు మాండ్ర శివానందరెడ్డి, ఆయన సోదరుడు మాండ్ర లింగారెడ్డి, మాండ్ర ఉమాదేవిలు తీవ్రంగా పోరాటం చేస్తున్నారు. గత ఎన్నికల్లో విఫలం కావడంతో ఈ సారి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేసి తమ సత్తా చాటుకోవాలని మాండ్ర శివానందరెడ్డి తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

**● బైరెడ్డి శబరి పోటీ గిత్తాకు కలిసి రానుందా?**

గిత్తా జయసూర్య గెలుపు కోసం మాండ్ర కుటుంబ సభ్యులు, టీడీపీ కార్యకర్తలు అవిశ్రాం తంగా పని చేస్తున్నారు. అయితే నంద్యాల ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి సొంత నియోకవర్గం నంది కొట్కూరు కావడం గిత్తాకు కలిసి రానుందని విశ్లేష కులు చెబుతున్నారు.

**● వైసీపీకి కాంగ్రెస్ ఎఫెక్ట్ ?**

ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌కు వైసీపీ టిక్కెట్ ఇవ్వ కుండా నిరాశ చూపడంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. కానీ ప్రస్తుతం ఎమ్మెల్యేకు అండగా ఉన్న క్యాడర్ మొత్తం టీడీపీలో చేరుతోంది. దీంతో తోగూరు ఆర్థర్ వల్ల వైసీపీ ఓటు చీలుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌తో పాటు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్థాపించిన జైభారత్ నేషనల్ పార్టీ ప్రభావం చూపనుంది. ఈ పార్టీ నుంచి బొళ్లవరం గ్రామానికి చెందిన బోరెల్లి వెంకట్రాముడు బ్యాటరీ టార్చ్ సింబల్‌తో నందికొట్కూరు బరిలో ఉన్నారు.

## ప్రలోభాలపై దృష్టి పెట్టాలి

### ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్



మాట్లాడుతున్న నినా నిగమ్

**కర్నూలు(కలెక్టరేట్), మే 9:** నగదు, మద్యం ఓట ర్లను ప్రలోభపరిచే వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్, ఐఆర్ఎస్ (రిటైర్డ్) అధికారి ఎక్స్‌పెండీచర్ టీమ్స్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల నిర్వహణపై జనరల్ అబ్జర్వర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల వ్యయ పరిశీలకులతో కలిసి ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీనా నిగమ్ మాట్లాడుతూ ప్రశాంత వాతా వరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేసే సమయంలో సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి మద్యం అమ్మకాలు ఉన్నాయా లేదా అనేది చూడాలన్నారు. అనంతరం ఎన్నికలు సజా వుగా జరిగేందుకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిలా కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర అధికా రులు పాల్గొన్నారు.

## ఆర్ఐ జయరాం రెడ్డిపై వేటు

**ఆదోని, మే 9:** వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఆదోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) జయరామ్‌రెడ్డిపై ఎన్నికల సంఘం వేటు వేసింది. అధికార పార్టీ వైసీపీ ఎమ్మెల్యే చెప్పినట్లు పనులు చేయడమేగాకుండా.. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఆర్ఐ జయరాం రెడ్డి వ్యవహరిస్తున్నారని బీజేపీ, టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల సంఘం ఆదోని రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మకు ఆర్ఐపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో విచారణలో నిజమని తేలడంతో ఆర్ఐ జయరామ్ రెడ్డిని జిల్లా కలెక్టర్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అయినట్లు సమాచారం.

## వనిత మాట

చాగలమర్రి, మే 9:

### వడ్డీ లేని పొదుపు రుణాలు మేలు



ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకు పొదుపు రుణాలు వరం. మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షల వరకు రుణం ఇస్తామనడం ఆనందంగా ఉంది. పెళ్లి కానుక కింద రూ.లక్ష అందించడం వల్ల పేదలకు ఎంతో భరోసా కల్పించినట్లవుతుంది. ఉమ్మడి మేనిఫెస్టోతోనే మహిళల సాధికారత సాధ్యం. మహిళలకు ఆదరణ కల్పించిన వారికే ఓటు వేస్తాం.

- గంగుల ఆదిలక్ష్మి, చాగలమర్రి

### మూడు గ్యాస్ సిలిండర్ల వల్ల ఉపశమనం



టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీ ఆనందంగా ఉంది. దీని వల్ల ఆరు నెలల పాటు గ్యాస్ కొనాల్సిన అవసరం లేదు. చాలా మంచి పథకం. ఏడాదికి ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తే ఆర్థిక భారం నుంచి కొంత ఉపశమనం లభించినట్లవుతుంది. ఈ మేనిఫెస్టోలో మహిళలకే వరాలు అధికంగా ఉండటం సంతోషం.

- లక్ష్మీ కల్యాణి, చాగలమర్రి

### ఉచిత బస్సు ప్రయాణం మంచి పథకం



ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే పథకం చాలా మంచిది. తెలంగాణలో ఈ పథకం అమలులోకి రావడంతో అన్ని వర్గాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సూపర్-6లో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇవ్వడం మంచి పరిణామం. పేద మధ్యతరగతి మహిళలకు రవాణా ఖర్చు తగ్గుతుంది. ప్రజా రవాణా పెరుగుతుంది. మహిళలను ఆదరించే వారికే ఓటు.

- పి.చంద్రకళ, చాగలమర్రి

### పేదలు విద్యావంతులు అవుతారు



పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ప్రకటించడం వల్ల పేద విద్యార్థులు విద్యావంతులవుతారు. ఆడబిడ్డ నిధి ద్వారా రూ.1,500 నెలకు ఇస్తామంటున్నారు. ఆపై తల్లికి వందనం ద్వారా పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందిని బడికి పంపినందుకు రూ.15 వేలు చొప్పున అందిస్తామంటున్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకే వరాలు అధికంగా ఉన్నాయి. సూపర్-6 పథకాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. మహిళలకు అండగా ఉండే పార్టీకే మా ఓటు.

- సుబ్బలక్ష్మి, చాగలమర్రి

## ఓటరు నాడి..


### విలువలు లేకుండా పోయాయి



ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు, అంకిత భావం లేకుండాపోయాయి. అప్పట్లో ఎన్నికల ప్రచారం ఇంత ఆర్భాటంగా ఉండేది కాదు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థితోపాటు నాయకులు గ్రామాలకు వచ్చిన నేరుగా ప్రచారానికి వెళ్లేవారు కాదు. గ్రామంలోని ఐదారుగురు పెద్ద మనుషులతో మాట్లాడి ఒక చోట సమావేశాన్ని ఏర్పాటు చేసేవారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకొని గెలిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవారు. గ్రామ పెద్దల మాట మీద వారికి ఓటు వేసే వాళ్లం. ఇప్పుడు ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్నాయి. అప్పట్లో మద్యం, డబ్బులు పంపిణీ చేసేవాళ్లు కాదు. నిజాయితీగా ఓటు వేసేవాళ్లు.

పద్మావతమ్మ, మహిళ, చింతలచెరువు గ్రామం

### నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తాం



అప్పటి ఎన్నికలకు, ఇప్పటికీ చాలా తేడా ఉంది. నా వయస్సు 80 ఏళ్లు. చాలా ఎన్నికలు చూశా. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా ఉంది. ఇంత హంగు, ఆర్భాటాలు అప్పుడు ఉండేవి కావు. అప్పట్లో రెండు పార్టీలే ఉండేవి. మద్యం ప్రవాహం ఉండేది కాదు. ఇప్పుడు రాజకీయంగా డబ్బుతోనే నడుస్తోంది. అప్పట్లో మంచి, మర్యాదలతోనే పనులు చేసేవారు.

- టి.తిరుపాల్‌రెడ్డి, చిన్నవంగలి గ్రామం

# పోలింగ్ టూర్

- ఎక్కడెక్కడో ఉన్న వారికి ఫోన్ చేసి పిలుస్తున్న అభ్యర్థులు
- వచ్చి వెళ్లేందుకు అయ్యే ఖర్చు, బాధ్యత వారిదే...




**ఆదోని, మే 9:** ఊరికి పోదాం... చలో చలో.. ఓటు వేద్దాం చలో చలో..... వృత్తి, ఉపాధి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణె, ముంబై తదితర నగరాలకు వలస వెళ్లిన ఆంధ్రవాసులందరి నోటా ఇప్పుడు ఇదే మాట..! వీరందరి రాకతో శనివారం నుంచి సోమవారం దాకా ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలన్నీ కళకళలాడనున్నాయి. ఎందుకంటే.. ఉపాధి పొందుతున్న వారికి పోలింగ్ రోజైన సోమవారం సెలవు. మంగళవారం సెలవు పెట్టుకుంటే. శని, ఆదివారాలు ఎలాగు సెలవు రోజులే. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేశారు. మంగళవారం సెలవు పెట్టుకుంటే చాలు... ఓటు వేయడానికి వచ్చి నాలుగు రోజుల పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపే అవకాశం ఉండడంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

**● పక్కాగా ఏర్పాట్లు..**

ఒక్కటి కూడా మిస్ అవ్వకూడదు... మనకే పడాలి..... మన సెగ్మెంట్ ఓటర్లు ఏయే ప్రాంతాల్లో ఉన్నారో గుర్తించండి. వారిని పిలిపించండి.... ఎంత ఖర్చైనా మనమే భరిద్దాం... అంటూ అభ్యర్థులు తమ కేడర్‌కు ఆదేశిస్తున్నారు. ఓటర్ల జాబితాలో పేరు ఉండి, ఉపాధి రీత్యా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిని ఎక్కడున్నా సరే పిలిపించి మరీ ఓటు వేయించేందుకు సిద్ధమైన అభ్యర్థులు.. గ్రామాల వారీగా ఓటర్ల జాబితాను వడబోస్తున్నారు. వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారితో ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. ఐటీ సహా ఇతర ఉద్యోగాలకు కోసం వెళ్లిన ప్రతి ఒక్కరినీ ఆదివారం సాయంత్రంలోగా నియోజకవర్గానికి తీసుకువచ్చేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి ఫోన్ చేసి.. ఇతర పార్టీల వారెవరైనా వారితో మాట్లాడారా..? ఒకవేళ మాట్లాడి ఉంటే వారు ఏం హామీలిచ్చారు..? అనే విషయాలు కూడా తెలుసుకుంటున్నారు. వారిచ్చిన హామీలకంటే ఎక్కువ ఇచ్చి అయినా సరే, ఓటు తమకే పడేలా ప్లాన్ చేస్తున్నారు. అడ్వాన్స్‌గా పేమెంట్ యాప్‌ల ద్వారా ఎంతో కొంత మొత్తం వారి ఖాతాల్లో వేస్తున్నారు. వారు వచ్చి వెళ్లడానికి అయ్యే ఖర్చులను భరించడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన ఓక గ్రామంలోని నలుగురు ఓటర్లు ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్నారు. ఓటర్ల జాబితాలో వారిని గుర్తించిన ఓ అభ్యర్థి తాలుకా అనుచరులు.. అక్కడి వారికి ఫోన్ చేసి వచ్చి వెళ్లేందుకు అయ్యే ఖర్చుతో సహా అన్ని తామే చూసుకుంటామని, ఓటు మాత్రం కచ్చితంగా తమ నేతకే వేయాలంటూ కోరారు. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చి ఓటేసే వరకు.. వస్తున్నట్టు ఎవరికి చెప్పొద్దని అభ్యర్థించారు. ఆ ఒక్క నియోజకవర్గమే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఇవే పరిస్థితులు కనబడుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు చెన్నై తదితర పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారిని నియోజకవర్గాలకు రప్పించడానికి.. పలువురు అభ్యర్థులు ఏకంగా కార్లు కూడా సిద్ధం చేస్తున్నారు.



**● ఫస్ట్ టైమ్ ఓటర్స్ ముఖ్యం..**

ఈ ఎన్నికల్లో మొదటిసారి ఓటు హక్కు వచ్చిన విద్యార్థులు, యువత కూడా ఓటు వేసేందుకు గ్రామాలకు వెళ్తున్నారు. వారు కూడా తమకే ఓటు వేసేలా పలు పార్టీల అభ్యర్థులు, క్యాడర్ జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోబోయే వారు ఎవరికి దగ్గరగా ఉంటారు, ఎవరితో చెప్పిస్తే తమకు ఓటు వేస్తారనే అంశాలను బేరీజు వేసి మరీ వారితో సంప్రదింపులు జరుపుతున్నారు.

## ఓటర్ కార్డు లేకున్నా ఓటెయ్యొచ్చు



**ఆదోని, మే 9:** ఈ ఏడాది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారికి ఎన్నికల సంఘం తపాలా శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు పంపుతోంది. అయితే.. చాలా మందికి ఇవి ఇంకా అందలేదు. పాత ఓటర్లలో సైతం పలువురి వద్ద ఓటరు కార్డులు లేవు. ఇలాంటి వారంతా ఇతర గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

**అవి ఏంటంటే..**

- ఆధార్ కార్డు ● ఉపాధి హామీ కార్డు
- పోస్టాఫీస్, బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్
- కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్ ● పాన్‌కార్డు
- ఆర్జీఐ స్మార్ట్ కార్డు ● ఇండియన్ పాస్‌పోర్టు
- ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం
- దివ్యాంగులకు ఇచ్చే గుర్తింపు కార్డు.

## ఎన్నికలకు సహకరించాలి: కలెక్టర్



**కర్నూలు(కలెక్టరేట్), మే 9:** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికల భాగంగా జిల్లాలో 2204 పోలింగ్ స్టేషన్లు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని, గర్భిణులు, దివ్యాంగులు ఉన్నట్లయితే వారికి అక్కడే ఉన్న ఎన్ఎస్ఎస్ లేదా ఎన్సీఈసీ వారు సహాయకారిగా ఉండి ఓటు వేయిస్తారన్నారు. జిల్లాలో 40 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2204 పోలింగ్ స్టేషన్లలో 18 వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లు, 320 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు మొత్తం 338 ఉన్నాయని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి నియోజకవర్గానికి ఈవీఎంల పర్యవేక్షణకు గానూ ముగ్గురు బెల్ ఇంజనీర్లను కూడా ఉంటారని చెప్పారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రచారాలు ముగించాలన్నారు. 7 గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. 11వ తేదీ నుంచి 13వ తేదీ రాత్రి వరకు ఎలాంటి మద్యం అమ్మకాలు జరగరాదన్నారు. 13న లోకల్ హాలిడే కూడా ప్రకటించామని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మూడు వాహనాలకు మించి వాడరాదని తెలిపారు. ఆ వాహనంలో కూడా ఐదుగురి కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదన్నారు. పోలింగ్ రోజు, అంతకంటే ముందు రోజు మాత్రమే పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకోవచ్చన్నారు. ఇందుకు సర్టిఫికేషన్ తీసుకుని యాడ్స్ వేయించుకోవాలని, ఎలక్ట్రానిక్ మీడియాకు మాత్రం యాడ్స్ ఇవ్వరాదని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలతో బీవీ మాటా మంతి



**నందవరం:** ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఉపాధి కూలీలతో గురువారం హలహర్వి దగ్గర మాటా మంతి కలిపారు. ఉపాధి కూలీలకు గిట్టు బాటు ధర కల్పిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. మీకు టీడీపీ వచ్చిన వెంటనే కూలీ ధర పెంచుతామని హామీ ఇచ్చారు.

## మా నాన్నను గెలిపించండి



**హొళగుంద :** హొళగుంద మండల కేంద్రంలో ఆలూరు టీడీపీ అభ్యర్థి కుమార్తె ఐశ్వర్య మహిళలతో మమేకమయ్యారు. మహిళలతో కలసి వెల్లుల్లిని శుభ్రం చేస్తూ వారితో మాట్లాడారు. తన తండ్రిని గెలిపించాలంటూ ఆమె ఓటర్లను అభ్యర్థించారు

## బజ్జీలు వేస్తూ..



**నంద్యాల టౌన్ :** కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీ నరసింహ యాదవ్ తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. నంద్యాల పట్టణంలో ఇలా బజ్జీల బండి వద్ద బజ్జీలు వేస్తూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ ఆయన ఓటర్లను కోరారు.

## అవ్వా... ఓటుతో ఆశీర్వదించు



**కోసిగి :** కోసిగి మండలంలోని ఐరంగల్ గ్రామంలో మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వృద్ధులను ఆప్యాయంగా పలకించారు. తనను గెలుపునకు మీ ఆశీర్వాదం కావాలంటూ వృద్ధులను కోరారు.

## బీసీకి ఘన స్వాగతం



**అవుకు :** అవుకు మండలంలోని రామాపురంలో గురువారం బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభిమాన నాయకుడు రావడంతో గ్రామస్థులందరూ కలసి గజమాలతో బీసీకి ఘన స్వాగతం పలికారు.

# మద్యం సిద్ధం

- దుకాణాల నుంచి రహస్యంగా వైసీపీ డంపుల్లోకి
- జిల్లాలో సిద్ధం సభలకు ముందే మద్యం నిల్వలు
- అడ్డదారుల్లో పొరుగు రాష్ట్రాల మద్యం దిగుమతి
- మద్యం బాబులు అడిగితే నోస్టాక్..
- స్కానర్లు పని చేయడం లేదని సాకు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు





**కర్నూలు(అర్బన్), మే 9:** మద్యం లేకుండా ఎన్నికల్లో గెలవడం ఎట్లా? అందుకే కోడ్ రావడానికి ముందే వైసీపీ మద్యాన్నంతా దాచేయానుకుంది. మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంది. అవకాశం లేని నియోజకవర్గాల్లో ప్రభుత్వ దుకాణాలపై ఆధారపడింది. రాత్రిళ్లు మద్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం. జగన్ సిద్ధం సభలకు ముందే ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకులు మద్యం సమకూర్చుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకులకు పోలీసు, సెబ్, ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నట్లు విమర్శలున్నాయి. తెలంగాణ, కర్నాటకకు చెందిన మద్యాన్ని కర్నూలు, ఆలూరు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని సరిహద్దు గ్రామాల్లో డంపింగ్ నిల్వలు సిద్ధం చేసుకున్నట్లు ఎక్సైజ్ విభాగానికి చెందిన కొందరు అధికారులు, సిబ్బంది చర్చించుకోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నాయకులు అడ్డదారుల్లో ప్రభుత్వ మద్యాన్ని సొంతం చేసుకుంటున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని నేరుగా గోడౌన్ల నుంచే తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల నుంచి సైతం రాత్రిళ్లు నిబంధనలకు విరుద్ధంగా కేసుల కొద్దీ మద్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మద్యం దుకాణాల ఉద్యోగులు వైసీపీ నాయకులకు అన్ని విధాలా సహకరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మందు బాబులు వెళితే నో స్టాక్ అని చెబుతున్నారు. స్కానర్లు పని చేయట్లేదని, వెబ్ సైట్ రావట్లేదని సాకులు చెప్పి, వెనుక నుంచి వైసీపీ డంప్‌లకు మద్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు బలం చేకూరేలా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు చెక్ పోస్టుల్లో 42 కేసులు నమోదు కాగా 49 మందిని అదుపులో తీసుకుని 23 వాహనాలను సీజ్ చేశారు. గతనెల 4వ తేదీన రూ. 14.50 లక్షల తెలంగాణ మద్యం కడప జిల్లాకు తరలిస్తూ పట్టుబడటం వైసీపీ మద్యం నిల్వల ఉదంతాన్ని బలపరుస్తోంది. చెక్‌పోస్టుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది దాడుల్లో తమ వాహనాలను చూసీ చూడనట్లు వదిలేయాలని వైసీపీకి చెందిన కొందరు నాయకులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

**కఠినంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు**

ఎన్నికల కమిషన్ ప్రకారమే విక్రయిస్తున్నాం. ఎక్కడైనా ఫిర్యాదు అందితే వెంటనే అక్కడ చేరుకుని చర్యలు తీసుకుంటాం. డిజిటల్ ద్వారానే ఎక్కువ శాతం అమ్మకాలు జరగాలని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ఉన్నాయి. స్కాన్ కాకుండా బాటిళ్లు బయటకు పోయే సమస్య ఉండదు.

- చంద్రహాసన్, సీఐ ఎక్సైజ్

**మద్యం కీలకం:** సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు మద్యాన్ని కీలక అస్త్రంగా వాడుకుంటున్నారు. ఎరగా వేసి, కీలక వ్యక్తులను గుప్పిట్లో పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీ మాఫియా నియోజకవర్గ కేంద్రాల్లో రంగ ప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు కొంత మంది నియోజకవర్గాల వారిగా ప్రధాన గోడౌన్లు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కేస్‌లను రహస్యంగా ఇప్పటికే తరలించి, డంప్ చేసుకున్నట్లు ఆ పార్టీకి చెందిన నాయకులే చర్చించుకుంటున్నారు. వారు మండల కేంద్రాల్లోని ఆ పార్టీ బూత్ ఏజెంట్లకు ఇప్పటికే డబ్బు, మద్యం కేస్‌లు అందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొంత మంది సిబ్బంది, అధికార పార్టీ నాయకుల నుంచి ముందస్తుగా డబ్బు తీసుకుని స్కానింగ్ చేసి, వారికి రాత్రికి రాత్రే రహస్యంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మందు కోసం వెళ్లిన మద్యం ప్రియులకు స్టాక్ అయిపోయిందని చెబుతున్నారు. గట్టిగా నిలదీస్తే తాము అధికార పార్టీ కార్యకర్తలమని, తమనే ఎదిరిస్తావా అంటూ ఎదురు దాడికి దిగుతున్నట్లు సమాచారం. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మద్యం దుకాణాలను తెరిచి ఉంచాలి. అయితే మద్యం స్టాక్ అయిపోయిందని, తాము ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకుంటున్నామని చెబుతూ రహస్యంగా మద్యాన్ని బెల్టు షాపులకు అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదంతా పబ్లిక్ గానే సాగుతున్నా.. ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోవట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## శ్రీశైలం ఆలయానికి ఎలక్ట్రిక్ వాహనం


ఈవోకు వాహనాన్ని అందజేస్తున్న ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

**శ్రీశైలం, మే 9:** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ శ్రీశైలం దేవస్థానానికి ఎలక్ట్రిక్ వాహనాన్ని గురువారం విరాళంగా అందజేశారు. చైర్మన్ ఈ విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజుకు అందజేశారు. కార్యక్రమానికి ముందుగా బ్యాటరీ వాహనానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీజీబీ చైర్మన్ మాట్లాడుతూ బ్యాటరీ వాహనం విలువ సుమారు రూ.10 లక్షలు అని, మల్లన్న భక్తుల సౌకర్యార్థం ఈ వాహనాన్ని అందజేసినట్లు తెలిపారు. దేవస్థానం అధికారులు చైర్మన్‌కు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణ, నంద్యాల రీజనల్ మేనేజర్ పీవీ రమణ, వంశీకృష్ణ, శ్రీశైలం ఏపీజీబీ మేనేజర్ రామచంద్రశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం**

శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన శివశంకర్ అర్జున్ అనే భక్తుడు రూ.లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణీధర్‌ప్రసాద్‌కు అందజేశారు. భక్తుడికి దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

## వైసీపీ కార్యకర్త ఇంట్లో మద్యం స్వాధీనం


అరెస్టును చూపుతున్న సీఐ

**పగిడ్యాల, మే 9:** మండలంలోని ప్రాతకోట గ్రామంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు వైసీపీ కార్యకర్త ఇంట్లో దాడులు నిర్వహించి తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ సీఐ సీతారామిరెడ్డి తెలిపిన వివరాలివీ.. సమాచారం రావడంతో ప్రాతకోట గ్రామంలోని అలీబాబు అనే వ్యక్తి ఇంటిపై దాడులు చేశారు. దీంతో ఆయన ఇంట్లో 54 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అలీ బాబును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**ఆత్మకూరు:** సెబ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 576 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ మద్యం సీసాలను బుధవారం రాత్రి కృష్ణానదిపై బోటులో దాటించి ఆటోలో తీసుకొస్తుండగా దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈదాడుల్లో 576 క్వార్టర్ సీసాలతో పాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామానికి చెందిన శీలం శేఖర్, శీలం మద్దిలేటిని అరెస్టు చేయగా శీలం అబ్రహాం అనే వ్యక్తి పరీరాలో ఉన్నట్లు వివరించారు. సెబ్ సీఐ మారుతీరావు, ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.



**FORMAT C-1**

**(For Candidate to publish in News Paper, TV)**

**Declaration about Criminal Cases**

(As per Judgment dated 25th September 2018 of Hon'ble Supreme Court of India in WP. (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name of the Address of Candidate : **BUDDA RAJASEKHARA REDDY,** H.No. 2-48/A, Velpanur, Velgode - 518533, Nandyal District, Andhra Pradesh
Political Party : **TELUGU DESAM PARTY (TDP)**
Name of the Election Assembly, : **General Elections to Legislative Andhra Pradesh State - 2024**
Name of the Constituency : **135 - Srisailam Assembly Constituency**

I, **BUDDA RAJASEKHARA REDDY,** S/o. Late B. Vengala Reddy a candidate for the abovementioned election to declare for public information the following details about my Criminal antecedents.

**(A) Pending Criminal Cases**

| S.L No | Name of the court | Case No. & Dated | Sections of the concerned and brief description of offence(s) |
|---|---|---|---|
| 1. | NIL | FIR No. 86/2024, ATMAKUR PS | THREATENING Sec. 504, 506 & 155(3) Of IPC |
| 2. | NIL | FIR No. 64/2022, VELGODE P.S | PARTICIPATING IN DHARNA PROGRAME Sec. 143, 341 r/w 149 of IPC |
| 3. | NIL | FIR No. 111/2022, VELGODE P.S | ASSAULT AND THREATENING Sec. 324, 506 r/w 34 of IPC |
| 4. | NIL | FIR No. 133/2023, NANDYAL 3TOWN P.S | PARTICIPATING IN DHARNA PROGRAME ON THE EVE OF ARREST OF SRI CHANDRABABU NAIDU Sec. 151 of Cr.P.C |

**Sd/- BUDDA RAJASEKHARA REDDY,** MLA Contesting Candidate
135 - Srisailam Assembly Constituency

# టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలి: మాండ్ర


అల్లూరులో టీడీపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

**నందికొట్కూరు, మే 9:** టీడీపీ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి కోరారు. నందికొట్కూరు మండలంలోని దామగట్లలో వైసీపీ మద్దతుదారురాలైన సర్పంచ్ సుశీలమ్మ, వైసీపీ నాయకుడు ఏసురత్నం మాండ్ర శివానందరెడ్డి, గిత్తా జయసూర్య సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. దీంతో గ్రామంలో రోడ్డు షో నిర్వహించి అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రోడ్ షోలో మాండ్ర మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఒక రౌడీషీటర్ చేతిలో పెట్టిన జగన్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. నియోజకవర్గంలోని 70 వేల దళితుల్లో ఒక్కరు కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా జగన్మోహన్‌రెడ్డికి కనిపించలేదా? అని ఆయన ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య మాట్లాడుతూ స్థానికేతరులను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. నాయకులు తిమ్మారెడ్డి, మాలిక్ బాషా, రంగస్వామి, జగన్మోహన్‌రెడ్డి, వేల్పుల జ్యోతి, జయచంద్రుడు, వేల్పుల ఆనందరావు, జయరాజు పాల్గొన్నారు.

**టీడీపీలోకి కాంగ్రెస్ నాయకులు**

నందికొట్కూరు మండలంలోని కోళ్లబాపురం, బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరులోని కాంగ్రెస్ పార్టీ నాయకులు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో అల్లూరు గ్రామంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో బి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, బి.రాఘవేంద్రరెడ్డి, సొసైటీ కో ఆప్షన్ మెంబర్ రిజ్వాన్ బాషా తదితరులు ఉన్నారు.

**టీడీపీలోకి వైసీపీ నాయకులు**

మిడ్తూరు మండలం వీపనగండ్లకు చెందిన మనోహర్‌రెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, గుండం రమణారెడ్డి, మల్లయ్య, శంకర్ ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి, జయసూర్య సమక్షంలో వంద కుటుంబాలకు పైగా వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో మల్లయ్య, స్వాములు, రామకృష్ణ, రసూల్, చిన్న స్వాములు, కె.మహేష్ ఉన్నారు.

**కొత్తపల్లి మండలం నుంచి..**

కొత్తపల్లె మండలానికి చెందిన భారతీయుడు, శ్రీరాములుతో పాటు 30 కుటుంబాలు తదితరులు శివానందరెడ్డి, జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరాయి.

**పగిడ్యాల మండలం నుంచి..**

**పగిడ్యాల:** మండలంలోని ప్రాతకోట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వెంకటరెడ్డి, నరేష్, శోభన్, పార్థుతో పాటు 15 మంది నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ శేషమ్మ, డా.నాగశేషులు తదితరులు ఉన్నారు.

**కోల్స్ ఆనందాపురంలో జయసూర్య ప్రచారం**

**పాములపాడు:** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. పాములపాడులోని కోల్స్ ఆనందాపురం గ్రామంలో గురువారం ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుక, మద్యం, మట్టి మాఫియాలలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదని అన్నారు. నాయకులు జనార్దన్, రామకృష్ణ, సుంకిరెడ్డి, కృష్ణ, హఫీజ్, అర్జున్‌గౌడ్, దేవదానం, చంద్రపాల్, యాకోబ్, మనోహర్, మురారి, షణ్ముకరెడ్డి దేవసహాయం పాల్గొన్నారు.

**'టీడీపీ గెలిస్తేనే సుపరిపాలన'**

**మిడుతూరు:** టీడీపీ గెలిపించుకుంటేనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని చెరుకు చెర్ల, చౌట్కూరు గ్రామాల్లో గురువారం గిత్తా జయసూర్య మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. గోకారి, నర్సన్న గౌడు, రవణమ్మ, సర్వోత్తమ రెడ్డి, రఘురామయ్య శెబ్ బాషా, సురేంద్ర, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

**'రైతులెవరూ అధైర్యపడొద్దు'**

**కొత్తపల్లి:** వైసీపీ ప్రభుత్వంలో కొరగాని కొయ్యగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే చంద్రబాబు రద్దు చేస్తారని, రైతులెవరూ అధైర్యపడవద్దని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సూచించారు. నాగంపల్లి, కొక్కెరంచ, కొత్తమాడుగుల, దుద్యాల, నందికుంట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల ద్వారా మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. నాయకులు మండల కన్వీనర్ నారపురెడ్డి, మాజీ కన్వీనర్ జడ్.వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు స్వామిరెడ్డి, రఫీ, మల్లారెడ్డి, జహరుల్లా, చిన్నపుల్లారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దామగట్లలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి


టీడీపీలో చేరిన వైసీపీ ప్రాతకోట నాయకులు


కోల్స్ ఆనందాపురంలో ప్రచారం చేస్తున్న జయసూర్య

# ఓటమి భయంతోనే వైసీపీ డబ్బు పంపిణీ: బుడ్డా


సంతజూటూరులో భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

**ఆత్మకూరు, మే 9:** ఓటమి భయంతోనే వైసీపీ డబ్బు పంపిణీ చేస్తోందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. మండలంలోని నల్లకాల్వ, కొత్తరామాపురం, కరివేన గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎవరిని గెలిపిస్తే మన ఊరు బాగుంటుదని ఆత్మపరిశీలన చేసుకున్న తర్వాతే ఓటేయాలని ప్రజలకు సూచించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు అతి తక్కువ సమయంలో రూ.1500 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. ప్రత్యేకించి సిద్దాపురం ఎత్తిపోతల పథకం ద్వారా పది గ్రామాలకు సాగునీరు అందించిన ఘనత తనదేనని చెప్పారు. అలాగే ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులు, నీటి-చెట్టు కింద పంటపొలాలకు రస్తాలు ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. ప్రజల కోసం ఇంతలా పాటుపడితే గత ఎన్నికల్లో తనను ఓడించడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఐదేళ్లలో ఎమ్మెల్యే శిల్పా చెప్పుకోదగ్గ ఏ అభివృద్ధి చేయనప్పటికీ డబ్బుతో నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటమి భయంతో ఎమ్మెల్యే శిల్పా రూ.2వేలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాగా ఈ ఎన్నికల్లో డబ్బుకు, ఆత్మాభిమానం మధ్యే పోటీ ఉందని ప్రజలు తమ విలువైన ఓటుకు అమ్ముకోకుండా తమకు మేలు చేసే నాయకున్ని ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో ఆయన వెంట శివప్రసాద్‌రెడ్డి, రమేష్, రహంతుల్లా, రాముడు, సర్పంచ్ వెంకటరమణ, గిరిరాజు, కొండలరావు, రవీంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

**టీడీపీలోకి నల్లకాల్వ సర్పంచ్**

● ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామంలో అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. గ్రామ సర్పంచ్ వెంకటరమణతో పాటు సుమారు 20 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు రమేష్, వెంకటేశ్వరరెడ్డి, స్వామిరెడ్డి, రాజేశ్వరరెడ్డి, రాముడు తదితరులు ఉన్నారు.

**'వైసీపీని ఇంటికి సాగనంపాలి'**

**బండిఆత్మకూరు:** అరాచక పాలన కొనసాగించిన వైసీపీని ఓటు అనే ఆయుధంతో ఇంటికి సాగనంపాలని శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సంతజూటూరు, బండిఆత్మకూరు గ్రామాల్లో గురువారం బుడ్డా రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిల్పా చెప్పేవన్నీ అబద్ధాలేనని, రైతులకు మూడేళ్ల నీరివ్వకుండా కోట్లాది రూపాయల నష్టం చేకూర్చారని అన్నారు. అభివృద్ధికి మారుపేరు టీడీపీ అని, వచ్చే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, లాయర్ కృష్ణారెడ్డి, తులశమ్మ, మహేశ్వరరెడ్డి, మోక్షేశ్వరరెడ్డి, తిరుపాల్. శేషన్న, బాబురావు, జాకీర్‌ఖాన్, నందయ్య, నాగేశ్వరరావు, నారాయణ, సుబ్బయ్య, కొత్తూరయ్య పాల్గొన్నారు.

**పుట్టుపల్లిలో ప్రచారం**

**మహానంది:** మండలంలోని పుట్టుపల్లిలో గురువారం శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి విజయం కోసం ఆయన కుమార్తె బుడ్డా మేఘనారెడ్డి, బుడ్డా సీతారామిరెడ్డి కుమార్తె బుడ్డా వైష్ణవిరెడ్డి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యశస్వినిరెడ్డి, బుక్కాపురం టీడీపీ నాయకులు శివ, నాగపుల్లయ్య, మారెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


కరివేనలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడా


పుట్టుపల్లిలో ప్రచారం చేస్తున్న మేఘన రెడ్డి, వైష్ణవి రెడ్డి


టీడీపీలోకి చేరిన నల్లకాల్వ సర్పంచ్ వెంకటరమణ

## జిల్లాకు 9 మంది ట్రైనీ ఐపీఎస్‌లు


ట్రైనీ ఐపీఎస్‌లతో ఎస్పీ, ఎన్నికల ప్రత్యేక పోలీస్ అధికారి

**నంద్యాల క్రైం, మే 9:** ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రశాంత పోలింగ్ నిమిత్తమై నంద్యాల జిల్లాకు 9 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు వచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లాలో తీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు, సాధారణ, సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు, బందోబస్తు ఏర్పాట్లపై శిక్షణ పొందేందుకు విచ్చేశారు. వీరంతా గురువారం ఎస్పీ రఘువీర్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్పీ వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పోలింగ్ సందర్భంగా అవసరమైన పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో ప్రశాంత పోలింగ్ కోసం తీసుకుంటున్న చర్యలు, సాధారణ, సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు, బందోబస్తు ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనానియమావళి అమలవుతున్న తీరును ఎస్పీ వారికి వివరించారు. అలాగే ఎన్నికలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సాయుధ బలగాల సమీకరణ, మోహరింపు తదితర వాటిని తెలియజేశారు. ఎన్నికల ప్రత్యేక పోలీస్ అధికారి హిమాన్షుశంకర్ త్రివేది ట్రైనీ ఐపీఎస్‌లకు బందోబస్తు విధులపై అవగాహన కల్పించారు.

**ట్రైనీ ఐపీఎస్‌లు వీరే..**

నంద్యాల సబ్ డివిజన్‌కు ఆయూష్‌పాండె, మానసవీశర్మ, శ్యామ్యూల్ కేడ్రిక్ నర్రూలను నియమించారు. డోన్ సబ్ డివిజన్‌కు సంబంధించి గోల్డిగుప్తా, ప్రశాంత్‌సురేష్ దగలే, రోహన్ కేషన్‌ను నియమించారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌కు సంబంధించి అన్నుతటు, నిషా యాదవ్, వైశాలిజైన్‌ను నియమించారు.

## విద్యుదాఘాతంతో బర్రెల మృతి

**మహానంది, మే 9:** మసీదుపురం గ్రామానికి చెందిన థామస్‌కు చెందిన రెండు బర్రెలు గురువారం గ్రామ శివారులోని పంట పొలాల్లో తెగిపడిన 11 కేవీ విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు తగిలి మృతి చెందినట్లు రైతు తెలిపారు. రెండు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ కేబుల్ తెగిపడి ఈ ప్రమాదం జరిగిందని రైతు తెలిపారు. గ్రామ టీడీపీ నాయకుడు మౌళీశ్వరరెడ్డి బాధితునికి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

## 'ప్రజా సేవ చేసే అవకాశం కల్పించండి'


ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనరసింహ యాదవ్

**నంద్యాల టౌన్, మే 9:** గత 15 ఏళ్లుగా ప్రజలకు ఏదో సేవ చేయాలన్న లక్ష్యంతో ఉన్నత భవిష్యత్తును వదులుకొని ప్రజాక్షేత్రంలోనే ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుతున్నానని, ప్రజాసేవకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్ ఓటర్లను కోరారు. గురువారం నంద్యాల పట్టణంలోని నూనేపల్లె, పెద్ద ఆస్పత్రి సమీపంలో ఇంటింట ప్రచారం చేశారు. కూరగాయల వ్యాపారులు, సైకిల్ షాపులు, హాస్పిటల్స్‌లో వారు పని చేసే పనులను చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పార్లమెంటు పరిధిలో ఎక్కడ ఏ సమస్యలు ఉన్నాయో ఎంపీగా పని చేసిన పోచా బ్రహ్మానందరెడ్డికి తెలియదని అన్నారు. ఏమండలంలో ఏసమస్యలు ఏమిటో ప్రజలకు కావాల్సిన పనులు ఏంటో ఏ మాత్రం అవగాహన లేదన్నారు. గత ఐదేళ్ల నుంచి ఎన్ని కష్టాలు వచ్చినా జెండాను వదలేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా, నంద్యాల ఎంపీ అభ్యర్థిగా ఆశీర్వదించి గెలిపిస్తేనే నిజమైన అభివృద్ధి ఏమిటో చూపిస్తానని హస్తం గుర్తుకు ఓటు వేయాలని లక్ష్మీనరసింహయాదవ్ కోరారు.

## తరిగోపుల సర్పంచ్ మృతి

**జూపాడుబంగ్లా, మే 9:** తరిగోపుల గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ(70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎండతీవ్రత ఎక్కువ కావడంతో పాటు శ్వాసకోశ, బీపీ, షుగర్‌తో సీరియస్‌గా ఉండటంతో కర్నూలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వారం రోజుల పాటు వైద్యులు చికిత్స అందించినా కోలుకోలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపట్ల గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

## వాహనాల తనిఖీ

**మహానంది, మే 9:** మండలంలోని గాజులపల్లి సమీపంలోని అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద గురువారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రకాశం- నంద్యాల జిల్లాల సరిహద్దు పరిధిలోని గాజులపల్లి అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్ఐ లింగప్రసాద్ పాల్గొన్నారు.

## పోలీసు కవాతు

**నందికొట్కూరు, మే 9:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గురువారం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, నందికొట్కూరు రూరల్ సీఐ విజయ భాస్కర్, పట్టణ సీఐ ప్రకాష్ కుమార్‌తో పాటు ఆర్‌పీఎఫ్ సిబ్బందితో పట్టణంలో కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించు కోవాలని సూచించారు.


## రౌడీ రాజ్యాన్ని తరిమికొట్టాలి: శబరి


కొత్తపల్లిలో రోడ్ షో నిర్వహిస్తున్న బైరెడ్డి శబరి

**కొత్తపల్లి, మే 9:** నందికొట్కూరులో రౌడీ రాజ్యాన్ని తరిమికొట్టాలంటే టీడీపీని గెలిపించుకుందామని నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. కొత్తపల్లి బస్టాండు సెంటరులో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు రక్షణ కరువైందని ఆరోపించారు. నందికొట్కూరులో ఓ ముస్లిం మహిళను ఓ వైసీపీ నాయకుడు గురఖ చించేసి చెప్పుతో కొట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీల భరతం పట్టేరోజు దగ్గరలోనే ఉందన్నారు. కొత్తపల్లి పక్కనే కృష్ణానది ఉన్నప్పటికీ ఈ ప్రాంత రైతులకు సాగు, తాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, మహేశ్ నాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, అల్లిబాషా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో దొంగ నోటు కలకలం

● ప్రచార కూలీకి అందజేసిన ఓ రాజకీయ పార్టీ



నందికొట్కూరులో ప్రచార కూలీకి ఇచ్చిన దొంగ నోటు

**నందికొట్కూరు, మే 9:** నందికొట్కూరు పట్టణంలో ప్రతి రాజకీయ పార్టీ ప్రచారానికి కూలీలు వెళ్తున్నారు. ఇలా వెళ్లిన కూలీలకు రోజుకు రూ.200 కూలీ డబ్బులు ఇస్తున్నారు. ఈ సమయంలో ఓ రాజకీయ పార్టీ తన అతి తెలివితేటలను చూపిస్తూ... కూలీలను బురిడీ కొట్టిచ్చింది. పట్టణంలో కొన్ని రోజులుగా ఆయా రాజకీయ పార్టీలు ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. అందులో ఓ ప్రధాన పార్టీ తమ ప్రచారానికి కూలీకి వచ్చిన వారికి డబ్బులను చెల్లించింది. అందులో చెల్లని రూ.100 రూపాయల నోటును కూలీ డబ్బుల కింద అందజేశారు. ఇంటికి వెళ్లి చూసుకున్న సదరు కూలీ అది నకిలీ అని తేలడంతో ఆ పార్టీ నాయకుల వద్దకు వచ్చి విషయం చెప్పాడు. అయితే ఆ రాజకీయ పార్టీ నాయకుడు తాము ఇచ్చింది ఒరిజినల్ నోటు అని బుకాయిస్తూ.. వేరే నోటు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. ఇలానే పట్టణంలో చాలా చోట్ల ఆ పార్టీ నాయకులు దొంగనోట్లను కూలీలకు కూలీ డబ్బుల కింద ఇస్తూ మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# అరాచక పాలనకు అంతం తప్పదు: బీసీ

**అవుకు, మే 9:** అరాచక పాలనకు అంతం తప్పదని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా కునుకుంట్ల గ్రామానికి చేరుకొని టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డిని కలిసి ఎన్నికలపై చర్చించారు. అనంతరం కొండమనాయినిపల్లె, జూనూతల గ్రామాల్లో తొలిసారి ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీసీ జనార్దన్‌రెడ్డికి టీడీపీ నాయకులు ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి, రాయలసీమ ఉద్యమకారుడు సీమకృష్ణ, మండ్ల వెంకటేశ్, వడ్డె వెంకటేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బీసీ మాట్లాడుతూ ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయినిపల్లె గ్రామాల్లో గత 40 ఏళ్లుగా ప్రత్యర్థి ప్రచారం చేయడం కాని, పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను కూర్చోలేని పరిస్థితులు ఉండేవన్నారు. ఏకపక్షంగా ఓటింగ్ జరిగేదన్నారు. ఈ ఎన్నికల్లో గ్రామాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చి తొలిసారి టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించామని తెలిపారు. జూనూతల గ్రామాన్ని బీసీ ఇందిరమ్మ దత్తత తీసుకుంటుందని చెప్పారు. ఈ గ్రామాల ప్రజలు ఎవ్వరికి భయపడాల్సిన పనిలేదని నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవిప్రకాశ్‌రెడ్డి, డేలునాయక్, హను మన్‌నాయక్, రామకృష్ణానాయక్, గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మారంపుల్లారెడ్డి, రఘునాథరెడ్డి, బైరెడ్డి బాస్కర్‌రెడ్డి, వెంకటరమణ నాయక్, దంతెల రమణ, తిక్కన్న, పాల్గొన్నారు.

**టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి:** టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బీసీ జనార్దన్‌రెడ్డి కోడలు క్షీరారెడ్డి, కూతుళ్లు మనోరమ, మాధవిలు అన్నారు. గురువారం అవుకు మండలం శివవరం గ్రామంలో ప్రజాగళంలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం చేసి చంద్రబాబు ప్రవేశపెట్టబోయే సూపర్ 6 పథకాలను గురించి ప్రజలకు వివరించారు.

**బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిక**

**బనగానపల్లె:** తెలుగు మహిళ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సమక్షంలో అవుకు పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు గురువారం బనగానపల్లె టీడీపీలో కార్యాలయంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అవుకులోని కోట వీధికి చెందిన వెంకటేశ్వర్లు, శివ, అసదుల్లా, బషీర్, ఇమామ్, హుసేన్, మహమ్మద్‌హుసేన్, అల్లం బాలాంజనేయులు, రామకృష్ణ ఉన్నారు.



కొండమనాయినిపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

వీరికి బీసీ ఇందిరమ్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ కష్టపడి పని చేసి బీసీ జనార్దన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

**నవరత్నాల పేరుతో నవమోసాలు:** వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసిందని బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె మండలంలోని నందవరం, నందివర్గం గ్రామాల్లో బీసీ ఇందిరమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగింది శూన్యమని అన్నారు.

**'జగన్‌ను ఇంటికి సాగనంపండి'**

**కోవెలకుంట్ల:** అవినీతి సీఎం జగన్‌ను ఓడించి ఇంటికి సాగనంపాలని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు బీసీ రామ నాథరెడ్డి అన్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా జగన్ తీవ్ర అన్యాయం చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, నిరుద్యోగ భృతి అందిస్తారని అన్నారు. జగన్ పెట్టుబడిదారులను రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టనీయకుండా వారిని తరిమికొట్టారన్నారు. కేవలం బటన్ నొక్కి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు.





టీడీపీలో చేరిన వారితో బీసీ ఇందిరమ్మ, బీసీ క్షీరారెడ్డి, మనోరమ, మాధవిలకు స్వాగతం పలుకుతున్న శివవరం వాసులు

## నవరత్నాల పేరుతో నట్టేట ముంచారు

**ఎమ్మెల్సీ బీటీ నాయుడు**



మాట్లాడుతున్న బీటీ నాయుడు

**ప్యాపిలి, మే 9:** జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను నట్టేట ముంచిందని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు ఇవ్వకుండా దగా చేసిందని విమర్శించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే ఇప్పుడు వచ్చి వైసీపీ నాయకులు మాయమాటలు చెబుతున్నారన్నారు. చంద్రబాబుతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, టి.శ్రీనివాసులు, గండికోట రామసుబ్బయ్య, న్యాయవాది బాస్కర్‌నాయుడు, రామ్మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

## ఘనంగా గోగిశెట్టి జన్మదిన వేడుకలు



వీరారెడ్డిపల్లెలో కేక్ కట్ చేస్తున్న నరసింహారావు తల్లిదండ్రులు

**శిరివెళ్ల, మే 9:** టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది, టీడీపీ పెనుగొండ ఎన్నికల పరిశీలకుడు గోగిశెట్టి నరసింహారావు పుట్టిన రోజు వేడుకలను ఆయన స్వగ్రామమైన శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నరసింహారావు తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, నాగేంద్రమ్మ కేక్ కట్ చేసి నాయకులు, ప్రజలకు కేక్, స్వీట్లు పంచిపెట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి నరసింహారావు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఓబుళకొండారెడ్డి, శేషఓబుళరెడ్డి, డాక్టర్ సంజీవ్ కుమార్, గురుమూర్తి, ఓబయ్య, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయసింహారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, మోహన్‌రావు, కృష్ణమూర్తి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నరసింహా రావు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని రుద్రవరం సమీపంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పోలా గురుమూర్తి, ఓబులయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

## ఇటిక్యాల బాలిరెడ్డితో జేసీ దివాకరరెడ్డి భేటీ

**కొలిమిగుండ్ల రూరల్, మే 9:** మండలానికి చెందిన టీడీపీ నాయకుడు ఇటిక్యాల బాలిరెడ్డి కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి జేసీ దివాకరరెడ్డి గురువారం భేటీ అయ్యారు. తాడిపత్రి పట్టణంలో జేసీ అస్మిత్‌రెడ్డి గెలుపునకు సహకరించాలని బాలిరెడ్డిని కోరారు. కాగా బాలిరెడ్డి ఇటీవల వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో ఇటు బనగానపల్లె నియోజకవర్గం బీసీ జనార్దన్‌రెడ్డితోపాటు, తాడిపత్రి నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తానని బాలిరెడ్డి పేర్కొన్నారు.

## టీడీపీలో ఎలాంటి విభేదాలు లేవు

**కొలిమిగుండ్ల రూరల్, మే 9:** మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఎటువంటి విభేదాలు లేవని పార్టీ నాయకులు సురేష్, రంగనాయుడు, పుల్లయ్య, ఆదినారాయణ అన్నారు. గురువారం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీ అనుకూల పత్రికలో కావాలనే నాగిశెట్టిపల్లెలో టీడీపీ నాయకులు కొట్టుకున్నారంటూ అసత్య కథనం రాశారని తెలిపారు. టీడీపీ ఎక్కడా డబ్బులు పంచలేదని, ఇలాంటి తప్పుడు వార్తలు రాయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మధు పాల్గొన్నారు.

## పోలూరు వెంకటేశ్వరరెడ్డి సేవలు చిరస్మరణీయం





పోలూరు వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి, కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు

**బేతంచెర్ల, మే 9:** నంద్యాల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి సేవలు చిరస్మరణీయమని కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, డోన్ టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పలువురు కమ్మ సంఘం నాయకులు ఆయన సేవలను కొనియాడారు. గురువారం పోలూరు శ్రీనివాసరెడ్డి, రాఘవరావు ఆధ్వర్యంలో దివంగత పోలూరు వెంకటేశ్వరరెడ్డి సంతాప సభను మహానంది కమ్మ సంఘం సభ్యులు రవిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం నాయకుడు వెంకట్రావు, కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వరరెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటని అన్నారు. వెంకటేశ్వరరెడ్డి కుటుంబానికి టీడీపీ, రాష్ట్ర కమ్మ సంఘం అండగా ఉంటుందన్నారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి కమ్మ సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో మహానంది కమ్మసంఘం గౌరవాధ్యక్షుడు దూదిపల్లె వెంకట రమణ, మల్లేష్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి రవిబాబు, టీడీపీ నాయకులు శాంతి నగర్ పూర్ణ చంద్రరావు, మండల కమ్మ సంఘం నాయకుడు వెంకటకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మీ, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, అనం తరమణ, బలపాలపల్లె వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

## టీడీపీతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి

**బనగానపల్లె, మే 9:** తెలుగుదేశం పార్టీతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యమని గురువారం టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులంతా టీడీపీకి మద్దతు పలకాలన్నారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు జంగంశెట్టి, ఆయిల్ మురళి, బచ్చు బాస్కర్, శేగు ఎల్లయ్య, వంకధార శేషప్రసాద్ స్వామి, నాగేంద్రారెడ్డి, ఖాదర్ శ్రీరాముల రాంబాబు, తలారి హరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టంగుటూరు శీనయ్య

## జగన్ కుట్రలకు ఓటుతో బుద్ధి చెప్పండి: కోట్ల

**డోన్, మే 9:** రాష్ట్ర ప్రజల ఆస్తులను లాక్కునేలా సీఎం జగన్ చేస్తున్న కుట్రలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లా డుతూ సీఎం జగన్, మంత్రి బుగ్గన ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, తిమ్మయ్య యాదవ్, సుధాకర్ రెడ్డి, మోకు మద్దయ్య పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

**రైతు ద్రోహి జగన్: కోట్ల**

**ప్యాపిలి:** రైతుల ద్రోహి జగన్ అని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని పెద్దపూదిళ్ల, మెట్టుపల్లి, ఏనుగమర్రి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రైతు హక్కు చట్టంతో సీఎం జగన్ భూములను ఖాజేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. అనంతరం ఏనుగ మర్రి గ్రామంలో వైసీపీకి చెందిన రామ్‌గోపాల్, పరమేశ్వరుడు, నాగరాజు, బాలన్న, శంకర్ తదితరులు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాద్, టి శ్రీనివాసులు, మోపూరి రామక్రిష్ణ, ప్రసాద్‌రెడ్డి, శ్రీరాములు, తూర్పు లింగారెడ్డి పాల్గొన్నారు.

**రైతులకు రూ.20వేల ఆర్థిక సాయం:** చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఏడాదికి రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం నాయీబ్రాహ్మణుల కాలనీలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడుతోపాటు ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు మురళి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీకి చరమగీతం పాడండి: కోట్ల సుజాతమ్మ**

**బేతంచెర్ల:** రాష్ట్ర ప్రజలను నవరత్నాల పేరుతో మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య అధ్యక్షతన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ సోమశే ఖర్ రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు బజాజ్ రామిరెడ్డి, జనసేన పార్టీమండల అధ్యక్షుడు చల్లా మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

**టీడీపీలో చేరిక :** మండలంలోని అం బాపురం గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీలో చేరాయి. వీరికి కోట్ల గిరిధర్ రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించార. వెంకటసుబ్బయ్య, ఎర్రమల, చంద్రుడు, నారాయణ, మహారాజ, మద్దిలేటి పాల్గొన్నారు.

**యువతకు 20 లక్షల ఉద్యోగాలు: కోట్ల చిత్రమ్మ**

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారనీ డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ అన్నారు. గురువారం మండలంలోని గుమ్మకొండ గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి, హరిశంకర్‌గౌడు, సుగాలి, గోపాల్ పాల్గొన్నారు.



డోన్‌లో ప్రచారం చేస్తున్న కోట్ల సుజాతమ్మ



## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**బనగానపల్లె, మే 9:** పట్టణంలోని అవుకు మెట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గురువారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సంజామల మండలం మొక్కమల్ల గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి (60) అవుకు మెట్ట నుంచి అర్బన్ కాలనీకి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 'విద్యుత్ శాఖకు రూ.5 లక్షల నష్టం'

**చాగలమర్రి, మే 9:** మండలంలో అకాల వర్షంతో విద్యుత్ శాఖకు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లిందని విద్యుత్‌శాఖ ఏఈ షాజహాన్ తెలిపారు. మండలంలోని రాంపల్లె, పెద్దబోదనం, గొట్లూరు, నేలంపాడు గ్రామాల్లో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 40 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయని, ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని చెప్పారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 'టీడీపీ విజయం తథ్యం'

**దొర్నిపాడు, మే 9:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ నాయకులు రమేష్‌బాబు, మునయ్య, బుర్రారెడ్డిపల్లె సర్పంచ్ గుండ్రాతి సుబ్బయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇందిరానగర్, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిరుపాలయ్య, అస్లాంబాషా, బాబు ఉన్నారు.

## 'ప్రజా సేవ చేసే అవకాశం కల్పించండి'



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

**నంద్యాల టౌన్, మే 9:** గత 15 ఏళ్లుగా ప్రజలకు ఏదో సేవ చేయాలన్న లక్ష్యంతో ఉన్నత భవిష్యత్తును వదులుకొని ప్రజాక్షేత్రంలోనే ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుతున్నానని, ప్రజాసేవకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్ ఓటర్లను కోరారు. గురువారం నంద్యాల పట్టణంలోని నూనెపల్లె, పెద్దాసుపత్రి సమీపంలో ఇంటింట ప్రచారం చేశారు. కూరగాయల వ్యాపారులు, సైకిల్ షాపులు, హాస్పిటల్స్‌లో వారు పని చేసే పనులను చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పార్లమెంటు పరిధిలో ఎక్కడ ఏ సమస్యలు ఉన్నాయో ఎంపీగా పని చేసిన పోచా బ్రహ్మానందరెడ్డికి తెలియవని అన్నారు. ఏ మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో.. ప్రజలకు ఏం కావాలో కూడా అవగాహన లేదన్నారు. ఐదేళ్ల నుంచి ఎన్ని కష్టాలు వచ్చినా జెండాను వదలేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా, నంద్యాల ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

# వైసీపీపై తిరుగుబాటు మొదలైంది: అఖిలప్రియ

**శిరివెళ్ల, మే 9:** వైసీపీ అరాచక పాలనలో విసిగిపోయిన రాష్ట్ర ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని.. టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. ప్రజాగళంలో భాగంగా మండలంలోని గుంప్రమాన్‌దిన్నె, శిరివెళ్ల గ్రామాల్లో గురువారం ప్రచారం చేశారు. శిరివెళ్లలో అఖిలప్రియ మాట్లాడుతూ నియోజకవర్గంలో శిరివెళ్ల, ఆళ్లగడ్డలో ఆటో నగర్‌లను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డలో లూటీ నాని.. ప్రతి పనికి ఓ రేటును నిర్ణయించి ప్రజాధనాన్ని కొల్లగట్టి సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనేక దౌర్జన్యాలకు పాల్పడ్డారని అన్నారు. భూమా కుటుంబంపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, ఇరిగెల ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఫిదా హుసేన్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**'వైసీపీని గద్దె దింపుదాం'**

**రుద్రవరం:** రాష్ట్రం అవినీతి పాలన కొనసాగించిన వైసీపీని గద్దె దింపుతామని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. మండలంలోని గోనంపల్లె, అప్పనపల్లె, పందిళ్లపల్లె గ్రామాల్లో గురువారం ప్రజాగళం యాత్ర చేపట్టారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి, అరాచకాలే ఉన్నాయని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. జనసేన పార్టీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో వెనకడుగు వేసి అవినీతిలో ముందడుగు వేసిన ఈ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు ఎర్రం ప్రతాప్‌రెడ్డి, గంగా వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ముకుందాపురంలో మాట్లాడుతున్న జగత్ విఖ్యాత్‌రెడ్డి



శిరివెళ్లలో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

**'అనుమతి ఎలా రద్దు చేస్తారు?'**

**నంద్యాల, మే 9(ఆంధ్రజ్యోతి):** ఒక పార్టీ ప్రచారానికి ఇచ్చిన అనుమతిని ఎలా రద్దు చేస్తారని, వైసీపీకి ఎలా అనుమతి ఇచ్చారని టీడీపీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి ప్రశ్నించారు. దొర్నిపాడు మండలం డబ్ల్యూకొత్తపల్లెలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబ్ల్యూకొత్తపల్లెలో ఈరోజు 9వ తేదీ వరకు ప్రచారానికి సంబంధించి ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తాను రాత పూర్వకంగా ఇచ్చిన అనుమతిని రద్దు చేశారని అన్నారు. డబ్ల్యూకొత్తపల్లె దివంగత భూమా నాగిరెడ్డి స్వగ్రామమని గుర్తుచేశారు. అయితే బుధవారం సాయంత్రం నంద్యాల ఎంపీగా పోటీ చేసిన వ్యక్తి తనకు ఇచ్చిన గుర్తు కాకుండా వైసీపీ గుర్తుతో ప్రచారం చేయడాన్ని వ్యతిరేకించామన్నారు. దీనిపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రతి ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయని, ఈసారి పోలీసు అధికారుల వల్ల గ్రామంలో మనస్పర్థలు చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. పోలీసు అధికారులు వైసీపీ వారి సొంత గ్రామమైన ఎర్రగుడిదిన్నెలో ఎందుకు ప్రచారానికి ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎస్వీ ప్రసాదరెడ్డి, రమేష్‌రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'**

**రుద్రవరం:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిత్తరేణిపల్లె, ముకుందాపురం గ్రామాల్లో గురువారం ప్రజాగళం యాత్ర చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రసాద్, సంజీవరాయుడు పాల్గొన్నారు.

# టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం

**మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్**

**చాగలమర్రి, మే 9:** టీడీపీతోనే మైనార్టీలకు సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్ అన్నారు. గురువారం రాత్రి చాగలమర్రి గ్రామంలో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీలపై సీఎం జగన్ కపట ప్రేమ చూపుతున్నారని అన్నారు. బీజేపీతో టీడీపీ ఎన్నికలకు వస్తోందని, వైసీపీ నాయకులు బీజేపీ వస్తే ముస్లింల 4 శాతం రిజర్వేషన్ తొలగిస్తారని, మసీదులను కూల్చేస్తారని అసత్య ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ తొలగించేందుకు సీఎం జగన్ ఆలోచిస్తున్నారని అన్నారు. మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు ఉసేన్‌వలి, షరీఫ్, మౌలాలి, అనీఫ్, రామసుబ్బయ్య, ఖలీల్, ఖాజారసూల్, రజాక్, సోను, సున్ని, మహబూబ్‌బాషా, బషీర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ముస్తాక్ అహ్మద్